క్లుప్తంగా

ఆర్పీలు, సీవోలకు సంక్రాంతి కానుకలు



ఆర్పీలకు కుక్కర్లు అందిస్తున్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆదివారం 42, 43, 44 వార్డుల్లో సేవలందిస్తున్న ఆర్పీలు, సీవోలకు సంక్రాంతి కానుకలుగా ప్రెజర్ కుక్కర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు విశేష సేవలందిస్తున్న ఆర్పీలు, సీవోలను ఇటువంటి సమయాల్లో కానుకలతో సత్కరించడం బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సంక్రాంతి పండగ అందరికీ భోగభాగ్యాలు, సిరి సంపదలు చేకూర్చాలని ఆకాంక్షించారు.

రాత్రి గస్తీ పెంచండి



సీఐ భాస్కరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గంటా కామరాజు, పోలరాజు

కంచరపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ కొత్త సీఐ సీరం భాస్కరరావును ఆదివారం జిల్లా ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు, విశాఖ స్టీల్ కార్యదర్శి, తిక్కవానిపాలెం ఆలయాల చైర్మన్ గంటా కామరాజు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వార్డులో రాత్రి పూట దొంగలు, మందుబాబులతో నెలకొన్న సమస్యలు, మహిళలు, విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులపై సీఐ వివరించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా రాత్రి పూట పోలీసు గస్తీని పెంచాలని వినతిపత్రంలో కోరారు. గ్రామ కమిటీ సభ్యులు సీరం పోలరాజు, గరికిని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా చిన్నారెడ్డి



చిన్నారెడ్డిని అభినందిస్తున్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మికులు

కంచరపాలెం: ఇండియన్ నేవీ సివిలియన్ ఎంప్లాయీస్(ఐఎన్‌సీఈ) యూనియన్ నూతన ప్రధాన కార్యదర్శిగా బోరా చిన్నారెడ్డిని యూనియన్ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఆదివారం నేవల్ ఏరియా అశోక్ పార్కులో ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఐఎన్‌సీఈ యూనియన్ మిత్రపక్షాలు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఐఎన్‌టీయూసీ గుమ్మిడి ఆదిమూర్తి అభినందించారు. ఉద్యోగులు, కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోరా చిన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సర్వసిద్ధి వెంకటరమణ, ఆర్ఎస్ నాయుడు, బి.అప్పలరాజు, ఆనంద్, బి.భోగేశ్వరరావు, రవి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్: నేవల్ సివిల్ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ ఎంప్లాయీస్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్(పులగాలిపాలెం) మేనేజింగ్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. విశాఖపట్నం కో ఆపరేటివ్ సొసైటీ రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ పి.రామారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా బి.తాతారావు, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా టి.శివరావు, కోశాధికారిగా ఎం.ప్రభాకరరావు, డైరెక్టర్లుగా ఎంసీఎస్‌వీ ప్రసాద్, బీవీఎస్ అప్పారావు, టి.కాంతారావు ఎన్నికయ్యారు.

వేగానికి కళ్లెం..!



ఈస్ట్ పార్కు వద్ద నిర్మించిన స్పీడ్ బ్రేకర్స్‌కు రంగులు వేస్తున్న కార్మికుడు

- మాధవధార గిరి ప్రదిక్షణ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు
- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

మద్రిపాలెం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు అనేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారుల్లో జీబ్రా క్రాసింగ్స్, డివైడర్స్, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవధార గిరి ప్రదిక్షణ రోడ్డులో పలు చోట్ల స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. ఈమేరకు ఈస్ట్ పార్కు వద్ద ఒకటి, మాధవధార వుడా కమ్యూనిటీ హాల్ దరి బెంగళూర్ బేకరీ వద్ద రెండు, విజేతా సూపర్ మార్కెట్ వద్ద ఒకటి చొప్పున నాలుగు స్పీడ్ బ్రేకర్లు వేశారు. రోడ్డు బాగుండటంతో వాహన చోదకులు వేగాన్ని పెంచి వాహనాలు నడుపుతుండటంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారని జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. దీంతో వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు, రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు జీవీఎంసీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు నిర్మిస్తున్నారు. ఈ చర్యలపై స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బెంగళూరు బేకరీ వద్ద ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్

ముగిసిన హిస్టరీ కాంగ్రెస్ సదస్సు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. పురావస్తు శాఖ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.తిమ్మారెడ్డి, ఏపీహెచ్‌సీ ప్రధాన కార్యదర్శి మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి, ప్రొఫెసర్ సోమశేఖర్‌రావు ముగింపు ఉపన్యాసమిచ్చారు.

బ్యాటరీ సైకిల్ ర్యాలీ

కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం 50 బ్యాటరీ సైకిళ్లతో బుల్లయ్య కాలేజీ నుంచి ఆర్కే బీచ్ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన మధుకుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని, నూతనాలోచనలతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, ఎస్‌సీసీ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌పై శిక్షణ



తయారు చేసిన వాల్ డెకరేటివ్స్‌ను ప్రదర్శిస్తున్న చిన్నారులు

సీతంపేట: విశాఖ పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలోని మియావాకీ సెంటర్‌లో స్టోరీ టైం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ట్రైనర్ రబియ నవాజ్ 1 నుంచి 4వ తరగతి విద్యార్థులకు కాగితంతో వాల్ డెకరేటివ్స్ తయారీ, 5 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నేమ్ ప్లేట్స్ తయారీపై శిక్షణ ఇచ్చారు. కొందరు పిల్లలు తమ తల్లిదండ్రుల కోసం బహుమతులు రూపొందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పిల్లలను ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌లో నిమగ్నం చేయడం వల్ల వారిలో స్కిల్స్, ఆలోచనా విధానం, ఊహాశక్తి మెరుగవుతాయని చెప్పారు. లైబ్రేరియన్ దుర్గారాణి పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్యావధానం

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వినూత్నంగా నిర్వహించిన హాస్యావధానం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. క్లబ్ నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా వినోదాల విందులో భాగంగా అవధాన కార్యక్రమం నిర్వహించారు. జె.ఎల్.నరసింహం(అవధాని) , కామేశ్వరరావు(చమత్కార కవి, అప్రస్తుతం), ఎం.వి.సుబ్రహ్మణ్యం(సమన్వయం) పాల్గొన్నారు. పృచ్ఛకులుగా నండూరి రామకృష్ణ(సందేశం), డాక్టర్ రజని(దత్తపది) జబర్దస్త్ ప్రకాష్(ఆశువు), డేవిడ్‌రాజు(పేరడీ), శివజ్యోతి (వర్ణన), తులసి గణేష్(విచిత్ర అంశం) పాత్రలు పోషించారు. సంధ్యా ప్రియదర్శిని, ఎస్.ఎస్.నాయుడు, సభికులు కురిపించిన ప్రశ్నలకు అవధాని హాస్యం జోడించి చెప్పిన సమాధానాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, పురుషోత్తం, సన్‌మూర్తి, దాడి సత్యనారాయణ అతిథులుగా పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. ఇటీవల రెండు సార్లు ఉత్తమ హాస్య నటుడిగా నంది అవార్డు అందుకున్న డేవిడ్‌రాజును సన్మానించారు. ఇక నుంచి ప్రతి నెలా ఒక హాస్య నటుడికి రేలంగి ఆత్మీయ సత్కారం చేసి, వార్షికోత్సవంలో రేలంగి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేస్తామని ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ప్రకటించారు.



హాస్య అవధానం చేస్తున్న కామెడీ క్లబ్ కళాకారులు

ఉపాధ్యాయుడు ధర్మారావుకు సత్కారం



ప్రశంసాపత్రం, మెడల్ అందుకుంటున్న తెలుగు ఉపాధ్యాయుడు ధర్మారావు

సీతంపేట: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగిన తెలుగు మహాసభల్లో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఎం.వి.ధర్మారావు పాల్గొన్నారు. శ్రీనారాయణభట్టు వేదికపై నిర్వహించిన రాజరాజ నరేంద్రుల వారి సహస్ర కవితా నీరాజనం కవి సమ్మేళనంలో వివక్షమా! నీకెన్నెండ్లు కవితా గానం, అందమా! అది మందమా! అను కథను చదివి తన ప్రతిభ చూపినందుకు అతిథుల చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నారు. అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మారావును ఆదివారం పాఠశాల హెచ్ఎం లక్ష్మీ నరస, సహచర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

33,286 మందికి కంటి శస్త్ర చికిత్సలు

- శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజు

సింహాచలం: నేత్ర వైద్య సేవల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత పనితీరు కనబరుస్తోందని ఆస్పత్రి డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. 2023లో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 2023లో 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. 1997లో ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించిందని తెలిపారు. రెటీనా, గ్లకోమా, కార్నియా వంటి ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ప్రగతి సాధించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్‌సీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతం పైగా రోగులకు కంటి వైద్య సేవలు అందించామన్నారు. 2023లో గ్లకోమా నివారణకు ఒక రోగికి గ్లకోస్ ఐస్టంట్ శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గాజువాక బీసీ రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.

కలకాలం నిలవాలి స్నేహబంధం



ఆత్మీయ కలయికలో జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న సీఐడీ అడిషనల్ ఐజీ శ్రీకాంత్

మురళీనగర్: తమ మైత్రీ బంధం కలకాలం నిలవాలని సీఐడీ విభాగం అడిషనల్ ఐజీ చెరువోలు శ్రీకాంత్ ఆకాంక్షించారు. జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ హైస్కూల్ 1986–87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన తన స్నేహితులతోపాటు పాల్గొని ప్రసంగించారు. చిన్న నాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎంత ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ స్నేహితులతో కలిసి గడిపిన క్షణాలు జీవితాంతం గుర్తుకు వస్తాయన్నారు. ఇలాగే ప్రతి ఏడాది కలుసుకుందామని పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థుల బృందం తరఫున మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ సంధాన కర్తగా వ్యవహరించారు. స్నేహితులు ఆత్మీయంగా పలకరించుకుని చిన్ననాటి సంఘటనలు జ్ఞాపకం చేసుకుని ఆనందంగా గడిపారు.

పూర్వ విద్యార్థుల సందడి

అమెరికాతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులందరూ సందడి చేశారు. బెంగళూరు నుంచి పంచముఖి, అమెరికా నుంచి సాగర్, సీఐడీ అడిషనల్ ఐజీ చెరువోలు శ్రీకాంత్, హైదరాబాద్ నుంచి సీతారామశాస్త్రి(టీసీఎస్), వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఎంపీడీవోలు, ఆర్ఐలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని ఆటపాటలతో అలరించారు. డాక్టర్ రాము తన స్నేహితులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. కోడి శ్రీనివాసరావు హాస్యం అలరించింది. ప్రతి ఏడాది జనవరి మొదటి ఆదివారం కలుసుకోవాలని నిర్ణయించారు. కష్టకాలంలో ఉనన తోటి స్నేహితుల కుటుంబాలను ఆదుకోవాలని నిర్ణయించారు. డాక్టర్ రాము, గెడ్డం విజయ్, సలీమ్, సాగర్, పంచముఖి, ప్రసన్నకుమార్, కె.శ్రీనివాసరావు, ఆర్ఎస్‌వీ ప్రసాద్, మళ్ల రమేష్, భూపతిరాజు పాల్గొన్నారు.

మంచి నాయకత్వం అవసరం



మాట్లాడుతున్న మాజీ క్రికెటర్ కమలాకర్

సీతంపేట: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి పాటుపడే మంచి నాయకత్వం అవసరమని మాజీ జాతీయ క్రికెటర్ కమలాకర్ అన్నారు. శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత నేత సబ్బంహరి అనుచరుడిగా ఆయన ఆశయాలకు విలువ ఇచ్చే పార్టీలో త్వరలో చేరనున్నట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆలోచన ఉందని, వారం పది రోజుల్లో ఏ పార్టీలో చేరేది ప్రకటిస్తానన్నారు. 2014 ఎన్నికల్లో జై సమైఖ్యాంధ్రా పార్టీ తరఫున ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినట్లు గుర్తుచేశారు. ముందుగా సబ్బంహరి చిత్రపటానికి కమలాకర్ నివాళులర్పించారు.

నేడు ముగ్గుల పోటీలు

మురళీనగర్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ఆవరణలో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారితో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బహుమతులు అందిస్తామని చెప్పారు. మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పోటీలో పాల్గొనే వారు రంగులు, ముగ్గు పిండి, ఇతర అలంకరణ సామగ్రి వారే తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 90901 87148), 94941 93858 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అలరించిన ఏక్ దిన్‌కా సుల్తాన్ నాటిక



ఏక్ దిన్‌కా సుల్తాన్ నాటికలో హాస్య ఘట్టం

మురళీనగర్: కళల ప్రోత్సాహంలో భాగంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఆదివారం ప్రదర్శించిన హాస్యనాటిక అలరించింది. పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రాత్రి 7 గంటలకు జంధ్యాల రచించిన ఏక్ దిన్‌కా సుల్తాన్ హాస్య నాటికను మాధవధారలోని శ్రీచైతన్య కళాసాగర్ నటులు ప్రదర్శించారు. దీనికి సనపల సన్యాసయ్య దర్శకత్వం, ఎల్వీ రమణ పర్యవేక్షణ చేశారు. ఎస్.సన్యాసయ్య, ఎస్.రామానుజయ్య, పి.గిరిధర్, ఎ.కొండలరావు, ఎస్.హరిబాబు, ఎస్.సత్యనారాయణ నటించి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. సత్యనారాయణ మూర్తి సంగీతాన్ని అందించారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక



ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో పూర్వ విద్యార్థుల సందడి

సీతమ్మధార: సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ స్వర్ణోత్సవాలను ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డ ఈ స్కూల్ పూర్వ విద్యార్థులందరూ పాల్గొని సందడి చేశారు. 1987 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు నృత్యాలు, మేళతాళాలతో ఊరేగింపుగా పాఠశాలకు విచ్చేసి ఆత్మీయ వేడుక జరుపుకున్నారు. ప్రత్యేక అతిథి రెవరెండ్ బవిరి సురేష్‌బాబు, రెవరెండ్ పి.ఇన్నారెడ్డి, ప్రెసిడెంట్ ఆఫ్ ఎస్ఎఫ్ఎస్ అల్యూమినీ అసోసియేషన్ రెవరెండ్ పి.మనోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు డా.ఎస్.మురళీధర్, జయచంద్ర వర్మ, పి.అనిల్‌కుమార్, శ్రీధర్ బిట్ర, పీవీఎస్‌వీ ప్రసాద్, రాఘవ శ్రీనివాస్ మాట్లాడుతూ 1982–94 విద్యార్థులతో ఏర్పాటైన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో దాదాపు 220 మంది ఉపాధ్యాయులు, ఫాదర్‌లు, పాఠశాల సిబ్బందిని ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. 50 ఏళ్లుగా తమలాంటి వేలాది మందిని ఉన్నత విద్యావంతులుగా ఎస్ఎఫ్ఎస్ స్కూల్ తీర్చిదిద్దిందని ఆనందం వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. తమకు విద్య నేర్పిన వారిని సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేష్

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ ఎస్.రమేష్ ఒక్కొక్క రౌడీషీటర్‌ను విడివిడిగా కౌన్సెలింగ్ చేశారు. వారికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని నడుచుకోవాలన్నారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్దకు పోలీసులు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు గంజాయి నిందితులకు రిమాండ్

- వేర్వేరు ఘటనల్లో 11 కేజీల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు సంయుక్తంగా దాడులు నిర్వహించగా తమిళనాడులోని మదురై ప్రాంతానికి చెందిన కాజా మైదీన్ ఇబ్రహిం, కర్నాటక బెంగుళూరుకు చెందిన మనీష్, చేతన్‌కుమార్ అనే ముగ్గురు వ్యక్తులను ఊర్వశి జంక్షన్ వద్ద పట్టుకుని వారిని విచారించారు. అరకు నుంచి గంజాయిని బెంగుళూరుకు తరలిస్తున్నట్టు తేలింది. దీంతో వారి వద్ద నుంచి 5 కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జల్సాల కోసం..

విలాసాలకు అలవాటు పడి డబ్బు సంపాదించాలనే నెపంతో గుంటూరుకు చెందిన సింగు యోగేష్‌బాబు అనే యువకుడు తనకు కొత్తగా పరిచయమైన హనీష్ వర్మ అనే స్నేహితుడు ఇచ్చిన సలహా మేరకు గంజాయి విక్రయించాలనుకున్నాడు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం అతడు గంజాయి తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా జ్ఞానాపురం ఫ్లై ఓవర్ వద్ద యోగేష్‌బాబును పట్టుకుని విచారించారు. అరకులోని పరశురాం అనే వ్యక్తి వద్ద 6 కేజీల గంజాయి కొని గుంటూరు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. అతడి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.భాస్కరరావు మిగతా వ్యక్తుల కోసం కేసు దర్యాప్తు చేపట్టారు.

'కటక్ ఫెస్టివల్'లో 'నాట్యం' విద్యార్థుల ప్రతిభ



పలు విభాగాల్లో గెలుపొందిన నాట్య విద్యార్థులు



అవార్డు పొందిన మాన్విత

సీతమ్మధార: కటక్‌లో నిర్వహించిన 15వ ఇంటర్నేషనల్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్–2024లో నార్త్ ఎక్స్‌టెన్షన్ దరి నాట్యం (నాట్యకళాక్షేత్రం) శిక్షణాలయానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదివారం జరిగిన డ్యాన్స్ ఫెస్టివల్‌లో నాట్యకళాక్షేత్రం విద్యార్థులు తమ అభినయంతో ప్రేక్షకులను, అతిథులను మంత్రముగ్ధులను చేసి పలు విభాగాల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా నాట్య గురువులు కె.వెంకట్ చిన్నారావు మాట్లాడుతూ విశాఖలో శిక్షణ పొందుతున్న తమ విద్యార్థులు కటక్‌లోనే కాకుండా ఇటువంటి పోటీలు ప్రపంచంలో ఎక్కడ జరిగినా విజయం సాధిస్తారన్నారు. పి.శ్రేష్ట, వి.కమల స్వేతిక, ఎస్.ఎల్.ఎస్.మాన్విత, ఇంటర్నేషనల్ నృత్య శిరోమణి సమ్మాన్ అవార్డులను సాధించారు. భరత నాట్యంలో సోలో డ్యాన్స్ కాంపిటేషన్ సీనియర్ విభాగంలో సాయి శ్రీనిధి ప్రథమ బహుమతి, జూనియర్స్‌లో ఎం.వినిద్ర, ఎ.లలితా శ్రీనిధి ప్రథమ స్థానం, టి.నిత్య ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. భరత నాట్యం సోలో డ్యాన్స్ సబ్ జూనియర్ విభాగంలో ఆర్.రాజశ్రీ నిపుణ ప్రథమ స్థానం, బి.నిషిత ద్వితీయ, పి.రుషిక తృతీయ స్థానాలు సాధించారు. నాట్య కళాకారులను జస్టిస్ డి.పి.చౌదరి అభినందించారు.

ఉత్సాహంగా కేరళీయుల క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధు



ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలిపే సెట్

మురళీనగర్: నగరంలోని కేరళీయులు క్రిస్మస్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రతి ఏడాది జనవరిలో నూతన సంవత్సరంతోపాటు క్రిస్మస్ వేడుకలను బిర్లా కూడలిలోని కేరళ కళా సమితిలో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కళా సమితి అధ్యక్షుడు ఏఆర్‌జీ ఉన్నిత్తన్ అధ్యక్షతన నిర్వహించిన సంబరాల్లో సినీ రచయిత, దర్శకుడు ప్రొఫెసర్ మధు ఎరవాంకర పాల్గొని అందరికీ క్రిస్మస్, న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పారు. కొత్త ఏడాదిలో కేరళీయుల కుటుంబాలు ఉన్నత స్థానంలో ఎదగాలని ఆకాంక్షించారు. చర్చి ఫాదర్‌లు జోఫీ చిరయత్, బ్లెస్సన్ ఫిలిప్, జెటీ వర్గీస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో ప్లాంట్‌ను ముఖ్య అతిథి మధు ఎరవాంకర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏసు జనన వృత్తాంతం ఆకట్టుకుంది. క్రిస్మస్ గీతాలు అలరించాయి. థింసా నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా సమితి కార్యదర్శి కె.హరిదాస్, డాక్టర్ రేజీ థామస్, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి కేరళీయులు పాల్గొన్నారు.